క్లుప్తంగా

మంత్రి పరామర్శ



అప్పారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఈనెల 28న వృద్ధాప్యంతో మృతి చెందిన భీమనాథుల అప్పారావు కుటుంబాన్ని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. సోమవారం అప్పారావు ఇంటికి వెళ్లిన మంత్రి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, నాయకుడు శ్రీహరిరాజు, కీర్తి బాలకృష్ణ, వడ్డీలు శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తోట రవి సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగుల్లో నూతన ఉత్తేజం



పిల్లలతో చేయిస్తున్న వ్యాయామాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ గీతాదేవి

తుని రూరల్: ఫిజియోథెరపీ సేవలతో దివ్యాంగులకు నూతన ఉత్తేజం వస్తోందని మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు డాక్టర్ టి.ఎన్.ఎస్.సోమేశ్వర రావు ఫిజియోథెరపీ సేవలు అందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. ఐఈఆర్‌పీలు ఎం.రాంబాబు, ఎస్.శ్రీనివాసు, దివ్యాంగు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

జగ్గంపేట: మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిన పంట పొలాలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సోమవారం పరిశీలించారు. రైతులకు సాగునీరందక పంట దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. తాళ్లూరు లిఫ్ట్ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల 31వేల ఎకరాలలో వరి పంటకు సాగునీటి సమస్య తలెత్తిందని, తక్షణం తాళ్లూరు లిఫ్ట్ బాగుచేసి ఆయకట్టు పరిధిలోని వరి పంటకు నీరందించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

అవినీతి రహిత సమాజం కోసం కృషి చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న పవర్ గ్రిడ్ ఉద్యోగులు

గండేపల్లి: అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూరంపాలెంలోని పవర్ గ్రిడ్ డీజీఎం సత్యవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం అవినీతి నిర్మూలనపై అవగాహన వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు అవినీతి వద్దు దేశానికి కట్టుబడి ఉండండి అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి నిర్మూలనపై సమీకృత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పవర్ గ్రిడ్ ఉద్యోగులు కుమర్, కోటేశ్వరరావు, మూర్తి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నసంతర్పణ

గోకవరం: గ్రామంలోని దేవీచౌక్ ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ తెలిపారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాస్‌రావు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. మండల ప్రజలు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

నందనవనంలో..

రౌతులపూడి: శృంగవరం-మెరకచామవరం సమీపంలోని నందనవనంలో వెలిసిన స్వయంభూ ఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన జరిగింది. గ్రామానికి చెందిన కుర్రె వెంకటేశ్వరరావు, అరుణ దంపతుల ఆర్థిక సాయంతో ఈ అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

పేదల ఆరోగ్యానికి సురక్ష

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వైద్యాన్ని చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రామచంద్రపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వృద్ధులు ఆస్పత్రులకు వెళ్లలేని వారు ఈ వైద్య శిబిరాల ద్వారా సొంత ఊర్లోనే వైద్యం పొందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని కొనియాడారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహార కిట్లు, పలువురు రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 409 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు వరప్రసాద్, ఆరిశ సత్యనారాయణ, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, అడబాల కొండబాబు, తహసీల్దార్ కేవీ మాధవరావు, వైద్య సిబ్బంది గంగాధర్, జేమ్స్, తాతారావు, లక్ష్మీనారాయణ, రాజా, సూర్యప్రకాశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూసమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

గాదెలపాలెంలో

గోకవరం: గాదెలపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. వైద్య శిబిరానికి గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. ఎమ్మెల్యే వారికి మందుల కిట్లు అందజేశారు.

ఎస్.అన్నవరంలో

తుని రూరల్: ఎస్.సూరవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎస్.అన్నవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కుసనం దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము ప్రారంభించారు. ఆయన రోగులకు సురక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా విశిష్ట వైద్యసేవలు అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్‌ను సత్కరించారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు కీర్తి రాఘవ, గారా శ్రీనివాసరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఏలేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



ఎస్.అన్నవరంలో సురక్ష కిట్లు అందజేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, నాయకులు

జగ్గంపేట: నరేంద్రపట్నం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని, రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట సొసైటీ అధ్యక్షుడు బుర్రిచక్రబాబు, గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఏలేశ్వరం: ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. పట్టణంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వైద్య సేవలు అందిస్తున్నారు. తొలుత ఆయన వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్‌చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, మసిరపు నాగేశ్వరరావు, తొండారపు రాంబాబు, కమిషనర్ కె.శ్రీనివాసరావు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రయ్యపేటలో కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులు

తొండంగి: ఎర్రయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ప్రారంభించారు. అనంతరం పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, మండల కన్వీనర్ బద్ది నూకరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల పూర్తికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ

కోటనందూరు: నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సుబ్రహ్మణశర్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం భవన నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తుది దశలో ఉన్న భవన నిర్మాణాలను నవంబరు 5 నాటికి అందుబాటులోకి వచ్చేలా సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేసి గడువు లోగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ ధర్నా

ఏలేశ్వరం: తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పట్టణంలో సోమవారం ధర్నా చేశారు. స్థానిక గొల్లల మెట్ట ప్రాంతానికి చెందిన పలువురు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమకు ఇళ్లస్థలాలు కేటాయించాలని వారు కోరుతున్నారు.

నిరుపేదలను ఆదుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: లింగంపర్తి గ్రామంలోని దేవస్థానం భూముల్లో నివాసం ఉంటున్న ఇళ్లు లేని నిరుపేదలను ఆదుకోవాలని కోరుతూ పట్టణంలో సోమవారం ఆందోళన చేశారు. సీపీఐ(ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపర్తిలోని దేవస్థానంలో భూమిలో నివాసం ఉంటున్న వారు హైకోర్టును ఆశ్రయించగా దేవస్థానం అధికారులు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. అధికారులు దీనిపై విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో నాగులాపల్లి అర్జునుడు, గండేటి నాగమణి, లోవరాజు, నూకరాజు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్స్ తగ్గితే ప్రమాదకరం

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య తెలిపారు. వేళంగి గ్రామంలో సోమవారం ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు.

పత్ర కషాయంపై శిక్షణ

జగ్గంపేట: మర్రిపాక గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులకు, డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు పది రకాల పత్రాలతో 200 లీటర్ల కషాయం తయారు చేయడంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం డ్వాక్రా మహిళలకు కిచెన్ గార్డెన్ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

సారాతో మహిళ అరెస్టు

రౌతులపూడి: ములగపూడిలో అక్రమంగా సారా అమ్ముతున్న మహిళను పట్టుకొని, ఆమె నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై అబ్దుల్‌నబి సోమవారం తెలిపారు.

వ్యాన్ బోల్తా

గండేపల్లి: 16వ నెంబర్ జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా కొట్టిన ఘటనలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం ప్రకారం.. హైదరాబాద్ నుంచి అనకాపల్లి సమీపంలోని అచ్చుతాపురానికి ప్లేవుడ్ లోడుతో వెళుతుండగా వ్యాన్ నీలాద్రిరావుపేట పరిధి పరిణయ ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చే సరికి రోడ్డుకు మధ్యలో ఉన్న ఐరన్ గ్రిల్స్, పోల్‌ను ఢీకొట్టడంతో వ్యాన్‌కు వెనక వైపు ఉన్న చక్రాలు ఊడిపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నవీన్ సురక్షితంగా బయటపడ్డాడు. హైవే మెయింటినెన్స్ సిబ్బంది రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్‌ను పక్క క్రమబద్ధీకరించి, వ్యాన్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీయించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

గోకవరం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గాదెలపాలెంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులు అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరిగి పట్టం కట్టాలని కోరారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, సర్పంచ్ కమ్మిల అచ్చిబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నాయకులు పెద్దాడ వెంకన్నదొర, గునిపే ఏడుకొండలు, కుంచే శివాజీ, ఆకాశపు వెంకన్న, దుక్కర దత్తుడు, యర్రంశెట్టి ప్రసాద్, కమ్మిల రాజా, కమ్మిల వీరబాబు, ఉప సర్పంచ్ దేవరశెట్టి సత్యన్నారాయణ, కోనా రామకృష్ణ, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గాదెలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

ప్రజల మెచ్చిన పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఉత్తరకంచిలో గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడురూరల్: ప్రజల మెచ్చిన పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఉత్తరకంచి గ్రామంలో సోమవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేసి, వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే వాటి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి ఆయన కృషి చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలవాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, ఎంపీటీసీ ఉమ్మిడి తాతీలు, పార్టీ నాయకులు రామిశెట్టి చిన్నబాబు, గొల్లపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరకంచిలో మహిళకు సంక్షేమ పథకాల పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

పట్టణాభివృద్ధికి పెద్దపీట

తుని: పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఏలూరి సుధారాణి అన్నారు. ఆదివారం స్థానిక 11వ వార్డు సినిమా రోడ్డులో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, ప్రముఖ వ్యాపారవేత్త చక్కా తాతబాబు, నరిశే శివాజీ, ఉమెన్స్ కాలేజీ పీఎంసీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధారాణి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా మారుమూల ప్రాంతాల్లో రోడ్లను సైతం అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా వైస్ చైర్మన్ షేక్ క్వాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.



తునిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధారాణి

మెట్టలో వరి కోతలు ప్రారంభం

తొండంగి: మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ కోతలు ప్రారంభమయ్యాయి. వ్యవసాయ బోర్ల పరిధిలో సాగు చేసిన వరి పంట పక్వానికి రావడంతో కోత పనులు చేపట్టారు. మండలం వ్యాప్తంగా పంపా, పీబీసీ, వ్యవసాయబోర్ల పరిధిలో ఈ ఏడాది వరినాట్లు వేశారు. సుమారు 10వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ముందుగా వ్యవసాయబోర్ల పరిధిలో సాగు నీటి లభ్యత ఉండడంతో వరినాట్లు వేశారు. మండలంలో బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి, సీతారాంపురం తదితర ప్రాంతాల్లో పంట కోత దశకు రావడంతో పంటను కోస్తున్నారు. మరి కొద్ది రోజులు పంపా, పీబీసీ ఆయకట్టు పరిధి ప్రాంతాల్లో కూడా కోతలు ప్రారంభమవుతాయని మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం తెలిపారు.



బెండపూడిలో వరి పంట కోస్తున్న కూలీలు

80 మందికి వైద్య పరీక్షలు

తుని: స్థానిక వాసవీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని శ్రీనివాసా ఇండస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి అధినేత కరక శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ కుసుమంచి సుబ్బరాయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కుసుమంచి శోభారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరంలో 80కి కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. విజయనగరం పుష్పగిరి ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్యులు పి.కుమార్ కంటి పరీక్షలు నిర్వహించగా, 40 మందికి కంటి శుక్ల ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో అవోగా సంఘ అధ్యక్షులు కడిమిశెట్టి సూర్యప్రకాష్, దాసరి నూకయ్యశెట్టి, పోలిశెట్టి వాసు, నూతిగట్టు సురేష్, కాపగంటి ప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు, అవోగ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

విలేకరి మృతికి సంతాపం



భీశెట్టి నందుబాబు

ప్రత్తిపాడు: స్థానిక ఓ పత్రికా విలేకరి భీశెట్టి నందుబాబు(35) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామానికి చెందిన నందుబాబు ప్రజాశక్తి, సూర్య తదితర పత్రికల్లో విలేకరిగా పనిచేశారు. ఈయన స్థానిక హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న తన గదిలో నిద్రలో ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. మృతదేహాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, సెబ్ సీఐ పి.అశోక్, పీసీసీ ధరణాల కోట శ్రీను, టీడీపీ నాయకుడు యాళ్ల జగదీష్, వివిధ శాఖల ఉద్యోగులు ఎంవీ రామరాజువర్మ, రాంజీ, ఎస్.రాజేష్ తదితరులు సందర్శించి, నివాళులర్పించారు. సాయంత్రం మృతదేహాన్ని నందు స్వగ్రామమైన గెద్దనాపల్లికి తరలించారు. మృతునికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు సోదరీలు, ఒక సోదరుడు ఉన్నారు.

వరప్రసాద్‌కు సాహితీ విఖ్యాత రికార్డు పురస్కారం

తుని: పట్టణానికి చెందిన కవిశ్రీ ఈవీవీఎస్ వరప్రసాద్(వరశ్రీ)కు సాహితీ విఖ్యాత రికార్డు పురస్కారం వరించింది. తెలంగాణ కరీంనగర్‌కు చెందిన ఆర్యాణీ సకల కళావేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న వాట్సాప్ వేదికగా అంతర్జాల అంతర్జాతీయ స్థాయి రికార్డుల కోసం కవితల పోటీ నిర్వహించారు. గంట వ్యవధిలో ఆరు అంశాలపై కవితలు రాసి పంపించాలని కవులకు చాలెంజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 60 మంది కవులు పాల్గొనగా అత్యుత్తమంగా నాలుగు కవితలు రాసిన తునికి చెందిన వరప్రసాద్‌ను అవార్డు వరించింది. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు దూడపాక, వెంకటేష్, మోటూరి నారాయణరావు, వైరాగ్యం ప్రభాకర్ తదితరులు వరప్రసాద్‌ను బంగారు కంకణం, శాలువ, పూలమాలతో సత్కరించి, సన్మానించారు. అవార్డు గ్రహీతను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న సాహితీ కళా ప్రతినిధులు

ఇరువర్గాల మధ్య ఘర్షణ



చికిత్స పొందుతున్న దొమ్మేటి వీరబాబు

ఏలేశ్వరం: తిరుమాలి గ్రామంలో సోమవారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగగా పలువురికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. తిరుమాలి గ్రామంలో ఇటీవల కాలంలో ఒకవర్గానికి చెందిన వారు తమ నాయకుడు వంగవీటి మోహనరంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనిని మరో వర్గం వారు చించివేశారని అనుమానంతో ఘర్షణ ప్రారంభమై తీవ్రంగా జరిగింది. ఈ ఘర్షణలో ఒకవర్గానికి చెందిన దొమ్మేటి వీరుబాబు, సాకా ఏసుబాబు, బోరా చంటమ్మ తీవ్రంగా గాయపడగా ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డీఎస్పీ లతా కుమారి, సీఐ శేఖర్‌బాబు, ఎస్సై జి.సతీష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.



ఏసుబాబు



చంటమ్మ

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపు

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు అదుపు చేయడానికి అవకాశం ఉందని, దానికి వ్యాపారులు సహకరించాలని పెద్దాపురం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి పిలుపునిచ్చారు. స్థానిక క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం పట్టణ పరిధిలోని వ్యాపారులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. వ్యాపారులు విధిగా షాపులు, వ్యాపార సంస్థల వద్ద రోడ్డును కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల వల్ల ప్రతిఒక్కరికీ ప్రయోజనం కలగడంతో పాటు ఇతరులకు మేలు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలతో ఏవిధంగా నేరస్తులను గుర్తించడానికి అవకాశం ఉంటుందో క్రైమ్ సబ్ డివిజన్ సీఐ కిషోర్‌బాబు వివరించారు. తాము గుర్తించిన వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దాపురం సీఐ రవికుమార్, సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్, క్రైమ్ సిబ్బంది, పట్టణ పరిధిలో వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా..

తుని రూరల్: ప్రజా ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీలు కలిశాయని రెండు పార్టీల సమన్వయ కమిటీ సభ్యులు యనమల రామకృష్ణుడు, కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం గెడ్లబీడు వద్ద సాయి వేదికలో తుని నియోజకవర్గ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రజాస్వామ్యక పరిపాలన కొనసాగుతుందన్నారు. ప్రజా ప్రయోజనం కోసం జైలులో ఉన్న చంద్రబాబునాయుడిని పవన్ కల్యాణ్ కలిసి పొత్తును ప్రకటించారన్నారు. పై స్థాయిలో చంద్రబాబు, పవన్ కలసినట్టే క్షేత్ర స్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పోరాడి రానున్న ఎన్నికల్లో అఖండ విజయం సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు అప్పులు చేసిందని యనమల రామకృష్ణుడు ఆరోపించారు. నవంబరు ఒకటో తేదీన టీడీపీ, జనసేన పార్టీలు ప్రత్యేక కార్యచరణతో ప్రజల ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. నిజాయితీ గల చంద్రబాబుకు ప్రపంచ వ్యాప్తంగా మద్దతు ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత, తుని, ప్రత్తిపాడు ఇన్‌చార్జులు యనమల దివ్యా, వరుపుల సత్యప్రభ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు, పార్టీ పరిశీలకుడు పెదిరెడ్ల చిట్టిబాబు, రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.